సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



సా..గుతున్న పనులు

వేములవాడ:శివరాత్రి జాతర సమీపిస్తున్నా.. అభివృద్ధి పనులు ఇంకా సాగుతున్నాయి. దీంతో భక్తులకు ఇబ్బంది తప్పేలా లేదు.

8లో▸



అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు: అంజన్న సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. దాదాపు 20వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో వెంకటేశ్, అధికారులు పర్యవేక్షించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

పల్లె వెలుగులు

ఉపాధిహామీలో లక్ష్యం మించి పనులు

- పల్లెప్రగతిలో ఉమ్మడి జిల్లాల పనితీరు భేష్
- తలసరి ఆదాయంలో కరీంనగర్ టాప్
- సాగుదారులు, కార్మికుల సంఖ్య ఎక్కువే
- తేల్చిన సామాజిక, ఆర్థిక సర్వే–2023



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రబడ్జెట్‌లో భాగంగా ప్రభుత్వ ప్రణాళిక విభాగం తాజా సామాజిక ఆర్థిక సర్వేను ప్రకటించింది. సామాజిక ఆర్థిక సర్వే 2023 నివేదికను ప్రభుత్వం విడుదల చేయగా, అందులో గతేడాదితో పోల్చి చూస్తే జిల్లా అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించింది. రాష్ట్ర సరాసరితో పోల్చి చూస్తే తలసరి ఆదాయం తక్కువగా ఉన్నా, ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ జిల్లా తలసరి ఆదాయం అధికంగా ఉంది. పల్లె ప్రగతిలో ఉమ్మడి జిల్లాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయి. పంటల మార్పిడి, పంటసాగు వైవిధ్యంలో పెద్దపల్లి, కరీంనగర్ రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచాయి. ఆర్థిక సర్వేలో ఉమ్మడి జిల్లా వివిధ రంగాల్లో పనితీరు వివరాలు..


లింగ భేదం పెరుగుతోంది..

ఉమ్మడి జిల్లాలో లింగనిష్పత్తి చూసినట్లయితే ప్రతీ వెయ్యి మందికి జగిత్యాలలో 1,002, సిరిసిల్లలో 1,014 మంది ఉన్నారు. అదే కరీంనగర్‌లో 993 మంది, పెద్దపల్లిలో 992 మంది మాత్రమే ఉన్నారు. అదే లింగనిష్పత్తి 0–6 వయస్సు ఉన్న చిన్నారుల్లో చూస్తే ప్రతీ వెయ్యి మంది బాలికలకు జగిత్యాలలో 947, సిరిసిల్లలో 942, కరీంనగర్‌లో 931, పెద్దపల్లిలో 922 మంది మాత్రమే ఉన్నారు.

అక్షరాస్యత శాతం..




ఉమ్మడి జిల్లా పూర్తిగా పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాల కలయిక వల్ల రాష్ట్ర సగటు కంటే తక్కువగానే ఉంది. రాష్ట్ర సరాసరి అక్షరాస్యత 66.54 శాతం ఉండగా, కేవలం కరీంనగర్ జిల్లా 69.16 శాతంతో రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. మిగిలిన జిల్లాలు తక్కువగా ఉన్నాయి.



విద్యుత్ కనెక్షన్లల్లో భేష్




ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, ఇండస్ట్రీయల్ విద్యుత్ కనెక్షన్లలో జగిత్యాల టాప్‌లో ఉండగా, వ్యవసాయ కనెక్షన్లలో పెద్దపల్లి, ఇండస్ట్రీయల్ కనెక్షన్లు సిరిసిల్లలో తక్కువగా ఉన్నాయి.



పల్లెప్రగతిలో ముందంజ




రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పల్లెప్రగతి నివేదికలను యాప్‌ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలు పల్లెప్రగతి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ మినహా మూడు జిల్లాలు రాష్ట్రంలోనే టాప్ 10 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.



లక్ష్యం మించి ఉపాధిహామీ




ఉమ్మడి జిల్లాలో లక్ష్యం మించి పనిదినాలు కల్పించటంలో అన్ని జిల్లాలు పోటీపడ్డాయి. అత్యధికంగా పెద్దపల్లి 121 శాతం పనిదినాలు కల్పించగా, జగిత్యాల 105 శాతం పనిదినాలతో ఉమ్మడి జిల్లాలో చివరిస్థానంలో నిలిచింది.



పనిచేసే వారు ఎక్కువే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభాలో సగటున 52 శాతం మంది పనిచేస్తున్నారు. ఇందులోనూ వ్యవసాయ ఆధారిత పనుల్లోనే అత్యధికంగా ఉపాధి లభిస్తోంది.



రేషన్ కార్డులే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు, రేషన్ కార్డులు కుటుంబాల కంటే అధికంగా ఉన్నాయి. ఇందులో అన్నపూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డుల్లో జగిత్యాల, గ్యాస్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉన్నాయి.

జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం కార్డులు	గ్యాస్ కనెక్షన్లు (లక్షల్లో)
కరీంనగర్	487	2,80,895	3.95
పెద్దపల్లి	413	2,22,524	2.18
జగిత్యాల	587	3,10,545	3.05
సిరిసిల్ల	344	1,75,484	1.45

మట్టికుప్ప ఘర్షణ మరణం వరకు..


శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం


హన్మంతు మృతితో రోదిస్తున్న కుటుంబసభ్యులు


హన్మంతు మృతదేహం

- వేములవాడలో హన్మంతు అనే వ్యక్తి మృతి
- రెండు రోజుల్లో ఇంట్లో శుభకార్యం..
- తండ్రి మరణంతో ఆగిన మూడో కూతురు వివాహం

వేములవాడ: వేములవాడలోని కూరగాయల మార్కెట్ వీధికి చెందిన సోయినేని హన్మంతు (62) తాపీమేస్త్రీగా పనిచేస్తూ ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు. మూడో కూతురుకు కూడా మంచి సంబంధం కుదిరింది. ఈనెల 10న వివాహం చేసేందుకు ముహూర్తం కుదిరించారు. రెండు రోజుల్లో పెళ్లి. ఇంటికి రంగులు.. ఇంటిముందర పచ్చని పందిరి వేశారు. శుభకార్యానికి అంతా సిద్ధం చేశారు. బంధుమిత్రులను ఆహ్వానించారు. అన్ని పనులు పూర్తయ్యాయని అనుకుంటున్న క్రమంలో తన ఇంటికి వెళ్లే చిన్న గల్లీ ప్రారంభంలో ఉన్న ఇంటి ఎదుట మట్టికుప్పను తొలగించాలని యజమాని ఆకుల శంకరయ్యను కోరగా.. మట్టికుప్పను తొలగించలేదు. మున్సిపల్ అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాడు హన్మంతు. మంగళవారం ఉదయం మున్సిపల్ ట్రాక్టర్ వచ్చి మట్టి కుప్పను తొలగిస్తున్న క్రమంలో శంకరయ్య కుటుంబసభ్యులు అడ్డు చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో హన్మంతుపై ఆకుల శంకరయ్య కొడుకు నాగరాజు దాడిచేయడంతో నోట్లోంచి రక్తస్రావం అయ్యింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. రెండు రోజుల్లో పెళ్లి కావాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. బాజాభజంత్రీలు మోగాల్సిన ఇంట్లో రోదనలు మిన్నంటాయి. చిన్నపాటి గొడవతో హన్మంతు చితికి చేరాడంటూ కాలనీవాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతుడి భార్య సోయినేని సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యాదాద్రి తరహాలో వేములవాడ అభివృద్ధి


ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమైన మంత్రి కేటీఆర్


- శివరాత్రి జాతర సమావేశంలో మంత్రి కేటీఆర్
- వైభవంగా ఉత్సవాలు జరిపించాలని ఆదేశం
- హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, వివిధశాఖల అధికారులు

వేములవాడ: యాదాద్రి తరహాలో వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మహాశివరాత్రి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్‌హెగ్డే, ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌తో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి రాజన్న మహాజాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు కాబట్టి వారికి సరిపడా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రాజన్న ఆలయ పరిసరాలతో పాటు భక్తులు విడిదిచేసే ప్రాంతాలు, పట్టణం మొత్తం పారిశుధ్యం లోపించకుండా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి సక్సెస్ చేయాలని ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యలుగా అంబులెన్స్, ఫైర్ ఇంజిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జాతరకు అదనపు నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ప్రతీఏటా రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శివార్చన కార్యక్రమాలు మరింత ఆర్భాటంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

వేములవాడలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి కేటీఆర్ సమీక్షించారు. గుడి చెరువులో చేపట్టే ట్యాంక్‌బండ్ పనులు వరంగల్ తరహాలో రూపొందించాలని ఆదేశించారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలు భవిష్యత్తులో పర్యాటకకేంద్రాలకు మారుపేరుగా నిలవాలని అన్నారు. ఇందుకు అధికారులు సరైన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రామప్పగుట్టపై ఎత్తయిన శివుడివిగ్రహం, కాటేజీలు, అడ్వంచర్ గేమ్స్, నాంపల్లి నర్సింహస్వామి గుట్టపై కేబుల్‌కార్ సౌకర్యాలు కల్పించబోతున్నట్లు వివరించారు. రాజన్న గుడికి చేరుకునే అన్ని ప్రధాన రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లు నిర్మించాలని ఆదేశించారు. అవకాశం ఉన్న ప్రతీ చోట వాల్ పేయింట్ ఆర్ట్ వేయించాలన్నారు. దీంతో పట్టణంగా మరింత సుందరంగా కనిపిస్తుందన్నారు. మూలవాగును ఆనుకున్న ఉన్న బండ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలనీ, బండ్‌పై వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్‌లుగా మర్చాలని ఆదేశించారు. రాజన్న ఆలయం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంస్కృత పాఠశాలకు అనుబంధంగా నృత్య, సంగీత కళాశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యువకుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు స్టేడియం పనులు త్వరలో పూర్తి కాబోతున్నాయని అన్నారు. కొదురుపాక నుంచి వేములవాడ వరకు ఫోర్‌లేన్ రహదారి నిర్మించబోతున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. నాంపల్లి గుట్టపై రెండో ఘాట్‌రోడ్డు నిర్మిస్తామని, ఇందుకు సరిపడా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే రమేశ్‌బాబు రాజన్న ప్రసాదం అందించి, స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తదితరులు ఉన్నారు.

ఎగువమానేరుకు మల్లన్నసాగర్ జలాలు


ఎగువమానేరులో చేరుతున్న నీరు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటోంది. ఎగువ ప్రాంతంలో సిద్దిపేట జిల్లాలో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి దిగువకు ఇటీవల నీటిని విడుదల చేశారు. అక్కడి చెక్‌డ్యాంలు నిండుకుంటూ మంగళవారం సాయంత్రం కూడవెల్లి వాగు ద్వారా నర్మాల ఎగువమానేరు జలాశయంలోకి నీరు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 25 అడుగుల నీటి మట్టం ఉంది. మల్లన్నసాగర్ జలాలు పూర్తిస్థాయిలో వస్తే రెండు మూడు రోజుల్లో ప్రాజెక్టు నిండుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 30 అడుగులు. యాసంగి సాగుకు ఇప్పటికే ఎడమ, కుడి ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు.

బీసీ నాయకులను అణచివేస్తున్న ప్రభుత్వం

- జీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి


మాట్లాడుతున్న యాదగిరి

ముస్తాబాద్: బీసీ అణగారిన వర్గాలకు చెందిన నాయకుడు చక్రధర్‌గౌడ్‌ను ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్టు చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ యాదగిరిగౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మోతె బాలరాజుగౌడ్ అన్నారు. ముస్తాబాద్‌లో మంగళవారం మాట్లాడుతూ... పేద కుటుంబాలకు అండగా ఉంటున్న బీసీ నాయకుడు చక్రధర్‌గౌడ్‌పై కక్షపూరితంగా కేసు పెట్టారని ఆరోపించారు. గీత కార్మిక సంఘం నాయకులను ప్రభుత్వం అణచివేస్తోందన్నారు. వందలాది కుటుంబాలను ఆదుకున్న చక్రధర్‌గౌడ్.. రాజకీయ శక్తిగా ఎదుగుతున్నాడని కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. తక్షణమే చక్రధర్‌గౌడ్‌పై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గడ్డమీది రామచంద్రం, కదిరె సత్యంగౌడ్, గున్నాల వెంకటస్వామిగౌడ్, అక్కపల్లి రాజారాంగౌడ్ ఉన్నారు.



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.

సదరం క్యాంపు విజయవంతం


శిబిరానికి హాజరైన దివ్యాంగులు

సిరిసిల్లటౌన్: జిల్లా ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం క్యాంపు విజయవంతమైంది. కంటిచూపు, వినికిడి లోపం ఉన్న దివ్యాంగులకు పరీక్షలు చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల నుంచి కంటిచూపు(9), వినికిడి(7)లోపం ఉన్న వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, డాక్టర్ రఘు, డాక్టర్ రజని, డాక్టర్ మోహనకృష్ణ, డీఆర్‌డీఏ ఏపీవో పాపారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ సంస్థకు నిధులు కేటాయించాలి


డిపో ఎదుట జేఏసీ నేతల నిరసన

సిరిసిల్లటౌన్: ఆర్టీసీకి రాష్ట్ర బడ్జెట్‌లో 2శాతం నిధులు కేటాయించాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్ల డిపో ఎదుట కార్మికుల సమస్యలపై నిరసన చేపట్టారు. ఆర్టీసీకి కేటాయించిన నిధులను ప్రతినెల చెల్లించాలని, బస్సులు పెంచాలని, కార్మికులకు 2పే స్కేల్ వెంటనే చెల్లించాలని, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెంచిన పనిభారాన్ని తగ్గించాలని, సీసీఎస్‌కు ఆర్టీసీ ఇవ్వాల్సిన డబ్బులు ప్రభుత్వం ఇచ్చి, యూనియన్లపై ఉన్న ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని కోరారు. పలు సమస్యలను వివరిస్తూ డిపోలో వినతిపత్రం అందించారు. జేఏసీ నేతలు పి.దేవయ్య, ఎం.గణపతి, కుమార్, బాలు, గౌస్, సుజాత, కరుణ, జ్యోతి పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా ప్రాథమిక పాఠశాలల్లో పదివేల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కోనరావుపేటలో మంగళవారం టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు నూగూరి దేవేందర్ అధ్యక్షతన సమావేశం అయ్యారు. ప్రాథమిక విద్య చాలా ముఖ్యమైందని, ప్రస్తుతం పాఠశాలల్లో ఎఫ్‌ఎల్ఎన్ అనే ముఖ్యమైన కార్యక్రమం జరుగుతున్నందున విద్యార్థి సామర్థ్యాలను సాధించాలంటే ప్రధానోపాధ్యాయ పోస్టు అవసరం అన్నారు. ప్రధానోపాధ్యాయ పోస్టు మంజూరు చేస్తే సమస్యకు పరిష్కారం అవుతుందని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సత్తు రవీందర్, నాయకులు విక్కుర్తి ఆంజనేయులు, గొంటి రవీందర్, సుల్తాన్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, బచ్చు అశోక్, సిద్దంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు సిరిసిల్ల విద్యార్థులు


పాట్నాకు బయల్దేరిన సిరిసిల్ల జిల్లా విద్యార్థులు

సిరిసిల్లటౌన్: జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు సిరిసిల్ల జిల్లా విద్యార్థులు మంగళవారం తరలివెళ్లారు. గత మాసంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో గెలుపొందిన 13మంది విద్యార్థులు అండర్–14, 16 విభాగాల్లో పాల్గొంటున్నారు. ఈనెల 10 నుంచి 12వరకు బీహార్‌లో జరిగే క్రీడలకు వెళ్తున్న బృందాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అభినందించారు. క్రీడాకారులు శ్రీపతి విక్రమ్, ప్రసాద్‌నాయక్, చేతన, అభిషేక్, కావ్య, అశ్విన్, అంజన, రామ్‌చరణ్, దిలీప్, వర్షిణి, అరుణ, జస్వంత్, అక్షయకు జిల్లా అథ్లెట్స్ అసోసియేషన్ కోచ్‌లు పిల్లి రామచంద్రం, గొట్ట రామచంద్రం, ఆడెపు శ్రీకాంత్, బొజ్జ చంద్రశేఖర్, సాయికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

కమలం గూటికి 'లగిశెట్టి శ్రీనివాస్'?


సంజయ్‌ని కలిసిన శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: గులాబీ దళం నుంచి సిరిసిల్ల సెస్ మాజీ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ కమలం గూటికి చేరారు. ఈనెల 10న బీజేపీ తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని లగిశెట్టి శ్రీనివాస్ సిరిసిల్ల నేతలతో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీలో ముఖ్య నేతగా ఉన్న ఆయన బీజేపీలో చేరడంపై సిరిసిల్ల రాజకీయాల్లో చర్చకు దారితీసింది.

క్లుప్తంగా

పలు ఆలయాల్లో చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కేడీసీసీ బ్యాంకు పరిసరాల్లోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. దొంగలు ఆలయ ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి గర్భ గుడి తాళం కూడా పగులగొట్టారన్నారు. హుండీ ఎత్తుకెళ్లి అందులోని నగదు, దేవతలకు అలంకరించిన 4 గ్రాముల పుస్తెలు, 4 గ్రాముల బొట్టు బిల్ల, 3 గ్రాముల ముక్కు పుడక తదితర వస్తువులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. నాగుల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వేములవాడ అర్బన్ ప్రాంతంలో..



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. మండలంలోని రుద్రవరం ఎల్లమ్మ ఆలయంలో 10 తులాల వెండి, హుండీ, పావుతులం బంగారం, పెద్దమ్మ ఆలయంలో బంగారుపుస్తె, మెట్టెలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. అనుపురం గ్రామంలోని రామాలయంలో హుండీని ఎత్తుకెళ్లారు. ఆరెపల్లి గ్రామంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో హుండీ తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం వేములవాడటౌన్ ఎస్సై వెంకట్రాజం చోరీ జరిగిన ఆలయాలను, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వరుసగా కరీంనగర్–సిరిసిల్ల రహదారిని అనుకుని ఉన్న మూడు గ్రామాల్లో నాలుగు ఆలయాల్లో చోరీ జరగడంతో పోలీసులు దొంగల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ వివరించారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



జవారిపేటలో దగ్ధమైన పత్తి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం జవారిపేటలో రైతు అన్నాడి రవీందర్‌రెడ్డి ఇంట్లో నిల్వ చేసిన పత్తి మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. స్థానికులు బిందెలతో నీరు చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సిరిసిల్ల నుంచి ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేశాయి. 15 క్వింటాళ్ల పత్తి దగ్ధం కావడంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం తాగి పట్టుబడితే కఠిన చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అనిల్ కుమార్

సిరిసిల్లక్రైం: నెలరోజులుగా నిర్వహించిన డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన 82మందిని కోర్టులో హాజరుపరిచామని వారికి కోర్టు జరిమానా విధించడం జరిగిందని సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ ఎస్సై రాజు సమక్షంలో డంక్అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ఈ సందర్భంగా కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఈ చిత్రం వేములవాడలోని మూలవాగుకు దక్షిణదిశగా తిప్పాపూర్ వైపు ఉన్న ఒడ్డు. మట్టితో కరకట్ట నిర్మించి, బండ్ నిర్మాణ పనులు చేపట్టి చాలా రోజులు అవుతోంది. జాతరకు వారం, పదిరోజులే ఉండగా.. నేటికీ పనులు ఇంకా పూర్తి కాలేదు.



మూలవాగుకు ఉత్తరదిశ వేములవాడ వైపు ఉన్న ఒడ్డు ఇదీ. ఈ ప్రాంతంలోనూ కరకట్ట బండ్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. జాతర సమీపిస్తుండగా.. ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని పట్టణవాసులు అంటున్నారు.

సమీపిస్తున్న జాతర.. సా..గుతున్న పనులు

- శివరాత్రి జాతరకు మరో పదిరోజులే..
- పూర్తికాని అభివృద్ధి పనులు



ఇదీ వేములవాడ మూలవాగుపై నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి. ఈ బ్రిడ్జి ఇప్పటి వరకు రెండుసార్లు కుప్పకూలింది. మూడేళ్లు కావొస్తున్నా పనులు ఇంకా పూర్తి కావడం లేదు. ఫలితంగా నిత్యం రాజన్న భక్తులకు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రద్దీ సమయంలో అవస్థలు చెప్పనక్కర్లేదు. ఇక జాతర సమీపిస్తుండగా.. ట్రాఫిక్ తిప్పలు తప్పేలా లేవు.

ఆధ్యాత్మిక వేములవాడ పట్టణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మూలవాగు అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. శివరాత్రి జాతరకు ముందే అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఇరిగేషన్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులను తరుచూ అప్రమత్తం చేస్తూ వచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ.. సలహాలు సూచనలు అందిస్తూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇవేమీ పట్టించుకోని సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూలవాగు ఒడ్డున రూ.63లక్షలతో నిర్మించే బండ్‌పనులు, మూలవాగుపై మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న రెండోబ్రిడ్జ్ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈనెల 17 నుంచి మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. కేవలం పది రోజులు మాత్రమే సమయం ఉండడంతో ఇప్పటికే భక్తులు రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో కొనసాగుతున్న పనులతో ఇబ్బంది పడుతుండగా.. అధికారుల్లో అలసత్వంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – వేములవాడ



జనవరి 11న కలెక్టర్ మూలవాడు ఒడ్డున బండ్‌పనులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని, మహాశివరాత్రి జాతర లోగా బ్రిడ్జి, బండ్ అందుబాటులోకి రావాలని ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులను అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టర్ మాటలు పట్టించుకోని సంబంధిత అధికారులు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారు.

భక్తులకు కనీస సౌకర్యాలు కరువు

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము

వేములవాడ: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కరువు అయ్యాయని, మహాశివరాత్రి జాతర మహోత్సవాలప్పుడే ఆర్భాటాలు చేయడం తప్ప శాశ్వత పనులు చేయడంలేదని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆలయ వసతి గదులు అధ్వానంగా మారాయని, పోస్టుమార్టం గదుల్లో ఉన్న విధంగా పార్వతీపురం వసతి గదుల్లో బెడ్స్ ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. కోట్లాది రూపాయల ఆదాయాన్ని రాజన్నకు కానుకలుగా ఇస్తున్న భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా రాష్ట్ర దేవాదాయశాఖ, రాజన్న ఆలయ ఉద్యోగులు కేవలం వీఐపీలకు సేవలు చేస్తున్నారని ఆరోపించారు. చలువ పందిళ్ల పేరుతో ప్రతిఏటా లక్షలాది రూపాయల రాజన్నధనం వృథా చేస్తున్నారని, శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. ఆలయ వసతి గదుల్లో అధికారులు అంతా ఒకరోజైనా నిద్రచేయాలని డిమాండ్ చేశారు. ధర్మగుండంలో అపరిశుభ్రత రాజ్యమేలుతుందన్నారు. అధికారులు సైతం ధర్మగుండంలో స్నానాలు చేయాలని కోరారు. నాయకులు ప్రశాంత్, అనిల్, ఆనంద్, కరుణాకర్, మహేశ్ ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రాయికల్(జగిత్యాల): మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన మోతె పెద్దులు (87) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై కిరణ్‌కుమా ర్ మంగళవారం తెలిపారు. మోతె పెద్దులు కొంతకాలంగా మతిస్థిమితం సరి గా లేకపోవడంతో పాటు భార్య చనిపోయిందనే ఆవేదనతో జీవితంపై విరక్తి చెందాడు. వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిల్లర్ ఢీకొని.. చిరువ్యాపారి దుర్మరణం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో మిల్లర్ ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముస్తాబాద్‌కు చెందిన కొండుగారి(మీస) రాజనర్సు(62) కూరగాయల మార్కెట్‌లో భార్య నర్సవ్వ కలిసి కొంతకాలంగా కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రాజనర్సు మార్కెట్ నుంచి భోజనానికి ఇంటికి వెళ్తుండగా రోడ్డు పనులలో ఉన్న మిల్లర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజనర్సు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు తనతోపాటు కూరగాయలు విక్రయించిన భర్త విగతజీవిగా మారడంతో భార్య నర్సవ్వ రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరడంతో.. జెడ్పీటీసీ నర్సయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సంతోష్‌రావు, నల్ల నర్సయ్య చర్చించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లకు తరలించారు. మృతుడికి భార్య నర్సవ్వ, కుమారుడు బాబుకిషన్, కుమార్తె భవిత ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



మృతదేహం వద్ద కుటుంబసభ్యుల రోదనలు

వైభవం.. వన మహోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు లక్ష్మీ అమ్మవారితో గజవాహనంపై కొండ కిందికి వచ్చి బీర్‌పూర్ అటవీప్రాంతంలో వనదేవతకు పూజలు నిర్వహించే కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. వృక్షోరక్షితి రక్షితః అన్న దానికి మానవాళి కట్టుబడి ఉంటేనే మనం చల్లగా ఉండగలుగుతామని దీంతో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారని అర్చకులు పేర్కొన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్‌ను కూడా లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని, అందుకే ప్రకృతిని, వన్యప్రాణులను, భూదేవిని కాపాడుకోవాలన్నది స్వామివారి ఆదేశం అని అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్వామివారికి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, జెడ్పీటీసీ పాత పద్మ, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, బందెల మరియ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఈవో శ్రీనివాస్, అటవీశాఖ సెక్షన్ అధికారి గంగారాం, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.





కన్నుల పండువగా రథోత్సవం

రాయికల్(జగిత్యాల): పట్టణంలో భీమన్న రథోత్సవం మంగళవారం కన్నులపండువగా జరిగింది. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, ఆలయ కమిటీ నిర్వాహకుడు దేవుని నర్సయ్య, భీమన్న యూత్ సభ్యులు, కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మ్యాకల అనురాధ, కన్నక మహేందర్, శ్రీరాముల సత్యనారాయణ, సాయికుమార్ పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన కొడుకుపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన పుట్ట కమలను చంపుతానని బెదిరించిన ఆమె కొడుకు పుట్ట ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. ప్రణయ్ రెండేళ్ల క్రితం ఇంట్లో తెలియకుండా సబిత అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇంట్లోకి రానివ్వకపోవడంతో వేరేచోట నివాసం ఉంటున్నాడు. జనవరి 30న తల్లి కమల ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లగా ప్రణయ్ ఇంటి తలుపులు, తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. తర్వాత ఆమెను బూతులు తిట్టడంతో పాటు చంపుతానని బెదిరించడంతో బాధితురాలు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టా భూమి ఆక్రమణకు యత్నిస్తున్నారని..

కోరుట్ల: మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్ శివారులో చిట్యాల నారాయణకు సంబంధించిన పట్టా భూమిని వనతడుపుల అరుణ్‌కుమార్ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాలు.. యెఖీన్‌పూర్– వేములవాడ రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 452లో గల 15 గుంటల స్థలం కొన్నేళ్లుగా చిట్యాల నారాయణ తండ్రి, తాతల పేరుమీద ఉండగా సదరు భూమిలో సోమవారం బాధితుడు బేస్‌మిట్ నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో వనతడుపుల అరుణ్‌కుమార్ వచ్చి సదరు భూమిని తాను కొనుగోలు చేశానని నారాయణ, అతడి తమ్ముడు నర్సయ్యపై దాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన నస్కూరీ నాగరాజు (30) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. నాగరాజు కొద్దికాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం తాగుతున్నావని ఆదివారం తండ్రి నర్సయ్య తల్లి ఈశ్వరమ్మ మందలించారు. దీంతో తాగిన మైకంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

చల్‌గల్‌లో మహిళ..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన ఎండి.షాహిదాబేగం (45) సోమవారం రాత్రి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలు.. షాహిదాబేగం గత 20 ఏళ్ల నుంచి బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. ఆమె భర్త కూడా సంవత్సరం క్రితం పెరాలసిస్ వచ్చి మంచంలోనే ఉంటున్నాడు. తనకున్న అనారోగ్యంతో పాటు భర్తకు కూ డా సేవ చేసేందుకు ఇబ్బందులు పడుతుండడంతో జీవితంపై విరక్తి చెంది మ నస్తాపంతో షాహిదాబేగం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు షాజిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

ముందస్తు సాగు ముంచింది..!

- అడ్డగోలు రసాయనాల పిచికారీ
- అయినా కోలుకోని వరిపొలాలు
- డిసెంబర్ 12నుంచి 25లోపు వేసిన పైరుపైనే 'మొగి' ప్రభావం
- చేన్లు చెడగొట్టి మళ్లీ నాట్లు వేసిన రైతులు



ఈ రైతు పేరు మండల సంపత్. వీణవంక మండలం మల్లన్నపల్లి. ఒకరివద్ద నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరివేశాడు. వారం రోజులకే పురుగుతాకిడికి దెబ్బతింది. పంటను కాపాడుకోవడానికి ఎకరాకు రూ.20వేల చొప్పున రూ.80వేలు వెచ్చించాడు. ఫలితం లేకపోవడంతో చేను చెడగొట్టి పదిరోజుల క్రితం మళ్లీ నాటు వేశాడు. నాటుకు ఎకరాకు రూ.4500 చొప్పున రూ.18వేలు కేవలం కూలీలకే చెల్లించాడు. ట్రాక్టర్‌కు రూ.24వేలు ఇలా.. రెండుసార్లు నాలుగు ఎకరాలకు రూ.1.30లక్షల పెట్టుబడి పెట్టాడు.



మల్లన్నపల్లిలో మళ్లీ నాట్లు వేస్తున్న కూలీలు

వీణవంక: జిల్లాలో మొగిపురుగు దెబ్బకు రైతులు విలవిల్లాడుతున్నారు. ఖరీదైన రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. మొగిపురుగుకు తోడు వేరుకుళ్లు, జింకు దాతులోపం, పచ్చపురుగు తాకిడి ఉండడంతో రైతుకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సూచనలు చేసినా ఫలితం ఉండడం లేదు. అయితే ముందస్తు వరినాట్లు వేయడంతోనే ఈ దుస్థితి వచ్చిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. డిసెంబర్ 25తర్వాత వేసిన వరినాట్లకు పురుగు తాకిడి లేదు. ఇప్పటికే అడ్డగోలుగా పెట్టుబడిన పెట్టిన రైతులు గత్యంతరం లేక చేన్లను చెడగొట్టి మళ్లీ నాట్లు వేశారు. జిల్లాలో ఈ ఏడు 1.91లక్షల ఎకరాలలో వరిసాగులోకి వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు దాదాపు వరి నాట్లు పూర్తయ్యాయి.



మొగిపురుగు ఆశించిన వరి

డిసెంబర్ 25లోపు వేసిన వరినాట్లపై ప్రభావం

- డిసెంబర్ 12నుంచి 25లోపు నాట్లు వేసిన వరి పైరుపైన ఈ పురుగు ఉధృతి తీవ్రంగా ఉంది. 25 తర్వాత వేసిన నాట్లకు పురుగు తాకిడి అంతంతే కనిపిస్తోంది. గత వానాకాలం పంట చేతికి వచ్చే సమయంలో మొగిపురుగు వ్యాప్తి చెందింది. రైతులు ఎన్ని రసాయన మందు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది.
- పంట కోసిన 40రోజుల్లోనే మళ్లీ యాసంగి నాట్లు వేశారు. దీంతో నాటు వేసిన వారం నుంచే పురుగు విజృంభించింది. జనవరి మొదటి వారంలో నాట్లు వేస్తే ఈ పురుగు వ్యాప్తి చెందకపోయేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. పొలం తడిఆరక ముందే నాట్లు వేయడం కూడా పురుగు ఉధృతికి కారణంగా చెబుతున్నారు.
- నాట్లు వేసి 45రోజులు గడిచినా.. వేసిన వరి వేసినట్లే ఉంది. వేరుకుళ్లు, జింకులోపం, పచ్చ పురుగు కూడా పైరుపైన ప్రభావం చూపుతోంది. రసాయన మందులకే ఒక్కోరైతు రూ.15వేల పెట్టుబడి పెట్టారంటే పురుగు ప్రభావం ఎలా ఉందో తెలుస్తోంది.
- పంట ఎదగకపోవడంతో చాలామంది రైతులు చేన్లు చెడగొట్టి మళ్లీ నాట్లు వేశారు. దీంతో నారుకు డిమాండ్ పెరిగి ఎకరం నారుకు రూ.2వేలు అదనపు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. కొంత మంది రైతులు వెదజల్లే పద్ధతి, మరికొందరు డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 12వేల ఎకరాలకు పైగా మళ్లీ నాట్లు వేసినట్లు సమాచారం.

ముందస్తు పైరు పైనే ప్రభావం

డిసెంబర్ 25లోపు వేసిన నాట్లపైనే పురుగు ప్రభావం ఉంది. ఆ తర్వాత వేసిన నాట్లకు పురుగు లేదు. వానాకాలం పంట పూర్తయిన వెంటనే యాసంగి నాట్లు వేశారు. అలా కాకుండా కాస్త సమయం ఇస్తే పంటపై ప్రభావం ఉండకపోవచ్చు. అక్కడక్కడ వేరుకుళ్ల ప్రభావం కూడా ఉంది. తడి ఆరని పొలాలకు పురుగు ఉధృతి ఉక్కువగా ఉంది. నాటు వేసిన 10రోజుల్లోపు గుళికలు వాడాలి. లేకుంటే పంటమార్పిడి చేయడం ఉత్తమం.
– వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్త, కేవీకే